చెన్నారం రోడ్డు.. గుంతలమయం

- 15 ఏళుగా మరమ్మతులకు నోచుకోని రహదారి
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

తలకొండపల్లి: చెన్నారం రోడ్డు అధ్వాన్నంగా తయారై గుంతలమయంగా మారింది. రోడ్డంతా గుంతలుగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్–చెన్నారం రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గుంతలుగా ఏర్పడి ఎగుడు దిగుడుగా తయారైంది. ఈ రోడ్డు నుంచి ప్రయాణించాలంటే ఎప్పుడు ఏమి జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనలు చెందుతున్నారు. 15 ఏళ్ల కిత్రం బీటీ వేశారు. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఫలితంగా బీటీ పాడైంది. కంకర తేలి, అధ్వానంగా మారింది. ఫలితంగా మట్టిరోడ్డును తలపిస్తోంది. వర్షకాలంలో వర్షం కురిసిదంటే నీరు గుంతల్లో చేరి బురద..బురదగా తయారవుతోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు పోయే దారి లేక అదుపు దప్పి తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహన చోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ రోడ్డు నుంచి ప్రయాణం చేసిన అనేక వాహనాలు అదుపు దప్పి ప్రయాణికులు గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ


చెన్నారం రోడ్డు దుస్థితి

రోడ్డు నుంచి వితాయిపల్లి మీదుగా ఆమనగల్లు–హైదరాబాద్ ప్రధాన రహదారి వరకు అనేక వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వాహనదారులు చెబుతున్నారు.

రాకపోకలకు ఇబ్బంది



చెన్నారం రోడ్డు మరీ అధ్వాన్నంగా తయారై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. 15 ఏళ్ల కిత్రం నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి మరమ్మతులు నిర్వహించలేదు. ఫలితంగా బీటీ ఎగిరిపోయి, కంకర తేలి అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన రోడ్డు వేయాలి

–రామాంజనేయులు, స్థానిక నాయకుడు, చెన్నారం

స్మిత సబర్వాల్ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీఎస్ నేతలు

ఇబ్రహీంపట్నం: వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య ఆధ్వర్యంలో ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ దిష్టిబొమ్మను బుధవారం ఇబ్రహీంపట్నంలో దహనం చేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ దివ్యాంగులను అవమానపరిచేవిధంగా స్మిత సబర్వాల్ ఎక్స్ సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విమానాలు నడపగలరా? శస్త్ర చికిత్సలు దివ్యాంగులు చేయగలరా? అని వాఖ్యనించడం ఆమె దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఒక ఐఏఎస్ అధికారి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని కించపరిచే విధంగా మాట్లాడటం దివ్యాంగుల హక్కులను కాలరాయడమేనన్నారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే ఇలా మాట్లాడితే ఎలా? అంటూ ప్రశ్నించారు? స్మిత సబర్వాల్ వాఖ్యలు వ్యకిగత విషయంగా పాలకులు మాట్లాడుతున్నరంటే దీనివెనుక ప్రభుత్వ కుట్ర దాగి ఉందని జంగయ్య ఆరోపించారు. దివ్యాంగులకు స్మిత సబర్వాల్ తక్షణమే క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కె శ్రీనివాస్, రాజు, జంగయ్య, బాల్‌రాజ్, యాదయ్య, సలీం, శ్రీను, సంజీవలు పాల్గొన్నారు.

మధుసూదనచారికి సత్కారం


అభినందనలు తెలుపుతున్న మహేశ్

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేతగా ఎన్నికైన సిరికొండ మధుసూదనచారికి ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ నాయకుడు కానుగుల మహేశ్ బుధవారం కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బెల్లయ్యనాయక్‌కు అభినందనల వెల్లువ


అభినందిస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తేజావత్ బెల్లయ్యనాయక్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బెల్లయ్యనాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి, శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలని, వారి అభివృద్ధికి పెద్ద మొత్తంలో కార్పొరేషన్ రుణాలు అందించాలని కోరారని దశరథ్‌నాయక్ తెలిపారు.

సొంత భవనాలు నిర్మించాలి

తలకొండపల్లి: ప్రభుత్వ పరంగా కొనసాగుతున్న గురుకుల పాఠశాల, కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినివాస్ డిమాండ్ చేశారు. బుధవారం రవాణా, వెనుకబడిన తరగతుల శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌కు హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చాలా వాటికి సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. చాలా గురుకులాల్లో మౌలిక సదుపాయాలు కరువై విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రికి విన్నవించారు. టాయ్‌లెట్లు, మరుగుదొడ్లు శుభ్రపరిచే సిబ్బంది లేక పోవడంతో విద్యార్థులే శుభ్రం చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర సభ్యుడు సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ గుర్తింపు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని బ్రిలియంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు యూజీసీఏ (యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ అటానమస్) గుర్తింపు లభించిందని ప్రిన్సిపల్ ఎస్‌కె రుస్తుం పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కళాశాల డైరెక్టర్ రఘోత్తం రెడ్డి, ఏఓ వేంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

కదిరే కృష్ణపై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: తిరుమల, తిరుపతి, వేంకటేశ్వరస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరే కృష్ణపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని హిందువాహిని నేతలు రోహిత్, నిఖిల్, అనిల్, శ్రీధర్‌లు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముదిరాజ్‌లను బీసీ–ఏ లోకి మార్చాలి

నియోజకవర్గ అధ్యక్షుడు భిక్షపతి

మంచాల: ముదిరాజ్ కులస్థులను బీసీ 'డీ' నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని సంఘం నియోజక వర్గ అధ్యక్షుడు గంట భిక్షపతి పేర్కొన్నారు. బుధవారం మంచాల తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదలు ఎక్కువ సంఖ్యలో ముదిరాజ్ కులస్థులుగా ఉన్నారన్నారు. ముదిరాజ్ కులస్థులకు న్యాయం జరుగాలంటే బీసీ–ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుండమోని జయమ్మ, ఆసంఘం నియోజక వర్గ కార్యదర్శి కావలి నర్సింహ, మండల అధ్యక్షుడు జిల్లామోని సత్తయ్య, మత్స్య శాఖ జిల్లా డైరెక్టర్ దూస వెంకటేశ్, గుండమోని మల్లేశ్, సతీష్ చంద్ర, చక్రపాణి, యాదయ్య, పిట్టల పెద్దిరాజ్‌ముదిరాజ్, కృష్ణ, జంగయ్య వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ కులస్థులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: ముదిరాజు కులస్థులకు న్యాయం జరగడం లేదని, ఓట్లు, సీట్ల కోసమే రాజకీయ పక్షాలు ముదిరాజులను వాడుకుంటున్నాయని ముదిరాజ్ సంఘం యాచారం మండల అధ్యక్షుడు నీలం శ్రీకాంత్ పేర్కొన్నారు. ముదిరాజుల సమస్యలపై బుధవారం యాచారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి కానమోని గణేష్, కోశాధికారి సంగెం భిక్షపతి, నర్సింహ, రాములు, మహేందర్, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


యాచారం: తహసీల్దార్ అయ్యప్పకు వినతి పత్రం అందజేస్తున్న నీలం శ్రీకాంత్ తదితరులు

సమస్యలు పరిష్కరించండి

అబ్దుల్లాపూర్‌మెట్: పెండింగ్‌లో ఉన్న 5డీఏలు ప్రకటించడంతో పాటు మండలానికి విద్యాధికారిని నియమించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నయ్య గారి గోవర్ధన్ యాదవ్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సభ్యత నమోదు కొండల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. పత్రికా సంపాదక వర్గ సభ్యుడు ఏ జగన్మోహన్ గుప్తాతో కలిసి ప్రారంభించారు. తొర్రూరు, కోహెడ, అనాజ్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో సభ్యత్వం నిర్వహించారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి మురారి, రాధాకృష్ణారెడ్డి, దీన్ దయాళ్ రెడ్డి, రవి, మహేందర్ రెడ్డి, రాజశేఖర్, మహేష్ పాల్గొన్నారు.

అధికారులు, గ్రామ కార్యదర్శులు బదిలీ

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో పనిచేస్తున్న పలువురు గ్రామ కార్యదర్శులు బదిలీ అయ్యారు. సింగంపల్లి గ్రామ కార్యదర్శి సురేందర్, చింతలపల్లి గ్రామ కార్యదర్శి శివకుమార్, సీతారాంనగర్ తండా గ్రామ కార్యదర్శి రమేశ్, ఆకుతోటపల్లి గ్రామ కార్యదర్శి సునీల్‌కుమార్, శంకరకొండ తండా గ్రామ కార్యదర్శి లక్ష్మణ్‌లు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో మాడ్గుల నుంచి జంగయ్య, తలకొండపల్లి మండలం నుంచి పవన్‌రెడ్డి, కడ్తాల మండలం నుంచి ప్రసాద్, కేశంపేట మండలం నుంచి విజయలు బదిలీపై ఆమనగల్లుకు వచ్చారు. ఆమనగల్లు ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్లుగా పనిచేస్తున్న నర్సింహా చంపాపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు, ఖలీం మహేశ్వరం ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో తలకొండపల్లి మండలం నుంచి రమేశ్, ఇర్విన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి కాసీమ్ బేగంలు బదిలీపై వచ్చారు. ఆమనగల్లు ఎంపీఓగా పనిచేస్తున్న ఉమారాణి మంచాల మండలానికి బదిలీ కాగా అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఎంపీఓగా పనిచేస్తున్న వినోద ఆమనగల్లుకు వచ్చారు. మండల పరిషత్ ఏఈఈ కృష్ణయ్య మాడ్గులకు, టైపిస్టుగా పనిచేస్తున్న రాకేశ్ కందుకూరుకు, సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రమేశ్ జిల్లా పరిషత్‌కు బదిలీ అయ్యారు. ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ డీఎంహెచ్ఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

కడ్తాల్: మైసిగండి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పది సంవత్సరాలుగా విధులు నిర్వహించి, బదిలీపై వెలుతున్న సత్యంను యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్ ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు, గ్రామస్తులు, వీడ్కోలు పలికారు.

క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మాడ్గుల: నూతన పట్టా, పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో నమోదు చేసుకోలేని రైతులు జూన్ 28వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాల నిండి, 59 సంవత్సరాల వయస్సు ఉన్న వారు దరఖాస్తు ఫారంతో పాటు పాస్‌బుక్, నామిని ఆధార్ కార్డు, రైతు ఆధార్ కార్డుతో వ్యవసాయ విస్తరణ అధికారికి సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ గౌతమ్ తెలిపారు

మధ్యాహ్న భోజనం పరిశీలన


కొల్కులపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కిషన్ రెడ్డి

మాడ్గుల: మండల పరిధిలోని కొల్కులపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మాజీ ఎంపీటీసీ బట్టు కిషన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నాణ్యత, రుచికరమైన భోజనాన్ని అందిస్తున్న హెచ్‌ఎంను, ఉపాధ్యాయులను బట్టు కిషన్ రెడ్డి అభినందించారు. పథకం విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనురాధ, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా మాధవరెడ్డి



ఇబ్రహీంపట్నం: రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన కొంతం మాధవ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి పద్మ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రైతు సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి పోరాటం చేస్తానన్నారు. రైతులకు రూ.2లక్షల రుణామాఫీ చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో జిల్లా పదవి బాధ్యతలు అప్పగించిన వారి ఆశలు వమ్ము చేయకుండా సీపీఐ, రైతు సంఘం బలోపేతానికి కృషిచేస్తానన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత


క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఉపాధ్యాయురాలు నీరజ

యాచారం: మండల కేంద్రంలోని యాచారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు గణితం ఉపాధ్యాయురాలు నీరజచంద్రశేఖర్ బుధవారం రూ.15వేల క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం నర్సింహ మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు ఆసక్తి కలిగిన క్రీడల్లో రాణించే విధంగా కృషి చేయాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు కూడ ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ జోసఫ్, గోపాల్, వెంకట్‌రెడ్డి, సీతారాం, బోజయ్య, జగదీష్, నీరజ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన


భిక్షాటన చేస్తున్న కార్మికులు

కడ్తాల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో జీపీ కార్మికులు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు, సీఐటీయూ ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని వారు కోరారు. సమస్యల పరిష్కారం కోసం 30న చేపట్టనున్న 'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ మండల అధ్యక్షుడు భవానీ కుమార్, చెన్నయ్య పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలి

డిప్యూటీ డైరెక్టర్‌కు ప్రజా సంఘాల ప్రతినిధుల వినతి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బోడ సామేలు, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి నూతనగంటి పురుషోత్తం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఈ సందర్భంగా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీయల్ రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వై. వెంకన్నను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సామేలు, పురుషోత్తంలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసం ప్రభుత్వం నిధులు కెటాయించాలని కోరారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో అత్యధికంగా వెనకబడిన పేదల సంక్షేమం కోసం, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అధికారులు ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు చేరేవిధంగా అవగాహన కల్పించాలని కోరారు. తద్వారా ఆర్థికంగా ఎదగడానికి పారిశ్రామిక వేత్తలుగా తయారు కావడానికి సులభమవుతుందన్నారు.


వెంకన్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సామేలు, పురుషోత్తం

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 1986–87 సంవత్సరంలో ఏడోతరగతి చదివిన విద్యార్థులు హైదరాబాద్‌లోని కాన్ఫరెన్స్‌హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. దాదాపు 37 ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితులంతా పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కుటుంబ సభ్యుల ప్రస్తుత వివరాలు తెలుసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం పూర్వవిద్యార్థులు ఉపాధ్యాయులు సాంభశివారెడ్డి, నర్సింహలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అశోక్‌కుమార్, రంగారావ్, శ్రీనివాస్‌రెడ్డి, చిన్నారెడ్డి, రూపం వెంకట్‌రెడ్డి, జయశ్రీ, శోభారాణి, సుజాత, తిరుపతమ్మ పాల్గొన్నారు.

డ్రైవర్ల పాత్ర కీలకం

సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేయడంలో డ్రైవర్ల పాత్ర కీలకమని సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆర్టీసీలో ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం డిపోలో ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్ జియాఉద్దీన్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. డిపో మేనేజర్ వెంకటనర్సప్ప ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో జరిగిన కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ మాట్లాడారు. ప్రయాణికుల ప్రాణాలు డ్రైవర్ల చేతుల్లోనే ఉంటాయని, వారిని క్షేమంగా గమ్యస్థానానికి చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపైనే ఉంటుందన్నారు. మలుపుల వద్ద, ఓవర్ టేక్ చేసే సమయాల్లో నిబంధనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. అనంతరం డిపో మేనేజర్ వెంకటనర్సప్ప మాట్లాడుతూ వేగ నియంత్రణ పాటిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా డ్రైవర్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామక్రిష్ణ, డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్, ఎంఎఫ్ సత్తయ్యలు పాల్గొన్నారు


జియాఉద్దీన్‌ను సత్కరిస్తున్న సీఐ సత్యనారాయణ, డీఎం వెంకట నర్సప్ప

నాణ్యమైన బోధనతోనే గుర్తింపు

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘన సన్మానం

కడ్తాల్: ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని, నాణ్యమైన విద్యా బోధనతోనే గుర్తింపు ఉంటుందని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న శ్రీనివాసచారి, రత్నమాల, రాఘవేంద్రచారి, చంద్రమోహన్, శోభరాణి, భాస్కర్‌రావు, బండి జంగయ్య బదిలీ అయ్యారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బదిలీపై వెలుతున్న ఉపాధ్యాయులకు, పాఠశాల హెచ్‌ఎం జంగయ్య అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. విధి నిర్వహణలో బదిలీలు తప్పనిసరన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి జంగయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, జీహెచ్‌ఎంలు గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, యూటీ ఎఫ్ నాయకులు మల్లయ్యగౌడ్, తపస్ కార్యదర్శి సుమరంజిత, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, లక్ష్మణ్‌జీ, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, రాంచంద్రయ్య, శ్వేతామాధురి, పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానించిన నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

నియోజకవర్గంలోని పలు మండలాల్లో నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామరావు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఆమనగల్లు పట్టణంలో మాజీ జెడ్పీటీసీ అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. బస్టాండ్ వద్ద కేక్ కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కడ్తాల్‌లో మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా కేక్ కట్ చేశారు. పార్టీ అభిమానులకు, నాయకులకు తినిపించారు. వెల్జాల్‌లో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.


ఇబ్రహీంపట్నం: ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు


ఆమనగల్లు: కేక్ కట్‌చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు అనురాధ, వెంకటేశ్ తదితరులు


కడ్తాల్: కేక్ కట్ చేస్తున్న ఉప్పల వెంకటేశ్, వెంకటేశ్‌గుప్తా, దశరథ్‌నాయక్


తలకొండపల్లి: కేటీఆర్ జన్మదిన వేడుకలో శ్రీనివాస్‌యాదవ్, తదితరులు